# ★ పొరుగింటి పుల్లకూర ★

రచన: పసల కృష్ణకుమార్

ఎప్పుడూ యెవరన్నారో గాని 'పొరుగింటి పుల్లకూర రుచి' అన్నమాట అక్షరాల నిజం...హోష్‌గా హోటలుకు వెళ్లి ముడుపు చెల్లించి తినే టిఫిన్లు బాగుంటాయి గాని యింటిలో చేసిన పదార్థాలు పనికి వస్తాయా ఏమిటి?

అయినా నా వెర్రిగాని నేనెంత మొత్తుకున్నా వింటారు కనుకనా! ఎందుకు వింటారు. సంపాదించుకుంటున్నారు కర్చు పెట్టుకుంటారు. మీకేం మహారాజులు, పైగా మగరాజులు' ఈశ్వరరావు ఇంటిలో అడుగు పెట్టి అరనిమిషమన్నా కాలేదు, జడివానలా మాటల వర్షం కురిపించింది ఇల్లాలు పార్వతి.

'ఎందుకలా యిదవుతూ ఆయాస పడిపోతావ్? నేను హోటలు కెళ్లానేగా నీ యీ దూకుడంతా? అసలింతకీ నేను హోటలు కెళ్లానని నీకెలా తెలుసు?... ఎలా తెలియడానికేముంది! నాముఖం చూస్తేనే తెలిసి వుంటుంది. అవునా?...అవును నేను హోటలుకు వెళ్ళి వచ్చినమాట నిజమే. ఏం అయితే? నలుగురిలో తిరుగుతున్నవాడిని. పదిమందితో పనిచేస్తున్న వాడిని కావడం వల్ల సరదాకి గాని, తప్పనిసరిగా గాని అలాంటి ఖర్చులు అవుసరమౌతూనే వుంటాయి. ఈ విషయం యింతకు పూర్వం నీకనేక సార్లు చెప్పాను. నేనేకదా సంపాదిస్తున్నానని వెనకా ముందూ లేకుండా దుబారా ఖర్చు పెడుతున్నా నంటావ్?—ఎప్పుడో అడపా దడపా అలా హోటలుకు వెళ్ళడం, అదే నిష్పత్తిలో సినిమాలకు వెళ్ళడం, రోజుకి ఓ అరపెట్టి (అవైనా అలీచవుకవి) సిగరెట్లు...ఇవేగా నేను చేసే దుబారా ఖర్చులు? నిజానికి నా యీ ఖర్చులన్నీ నీకంటికి దుబారా ఖర్చులుగానే కనిపిస్తాయి గాని, మా ఆఫీసులో చేసే బండచాకిరివల్ల జీవితం మీద కలిగే విరక్తిని పోగొట్టడానికి పరిహారంగా నాకు వచ్చే జీతమంతా ఖర్చుచేసినా ప్రయోజనం వుండదనే పరమ సత్యాన్ని గురించి నువ్వేమైన ఆలోచించావా?...అయినా పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రంలా ప్రతి ఒక్క చిన్న విషయానికి 'పొరుగింటి పుల్లకూర...' సామెతని ఉటంకించడం ఏమంత బాగా లేదు.' ఈశ్వర్రావు యింకా యెంతసేపలా మాట్లాడే వాడో యేమో గాని, వ్యధాపూరితమైన 'ఏమండీ...' అన్న పార్వతి మాట విని ఆమెవైపు చూశాడు ఈశ్వర్రావు. పార్వతి కళ్ళ నీళ్ల పర్యంతమై అతనివైపే చూస్తోంది. భర్త హృదయాన్నెందుకు నొప్పించానా' అనే బాధతో. ఈశ్వర్రావు యింతసేపూ తెచ్చిపెట్టుకున్న కోపంతో మాట్లాడుతున్న ధోరణిని మార్చి, ఏదో మాటవరసకన్నాను గాని నీ మనస్సు కష్టపెట్టాలని కాదు పారూ! ఏదీ! చిన్న నవ్వు! అదేగానా ఆశాజ్యోతి! ఊఁ నవ్వు మరి...ఆఁ! అదీ! మాటల సందడిలో మరచేపోయాను. ఇంతకీ నీ అసలు దిగులు నువ్వు చేసిపెట్టిన కమ్మని టిఫిను తినడానికి ఖాళీ లేకుండా హోటల్లో తిని వచ్చాననేగా? నే నెప్పుడైన నువ్వు వండిన దాన్ని పిసరంతైన నిష్ప్రయోజనం చేశానా? మరెందుకు నీకా దిగులు? ఏది ఇవ్వాళేం చేశావో రుచి చూద్దాం పద' అని నవ్వుతూ భార్యను వంటింటివైపు నడిపించుకుపోయాడు ఈశ్వర్రావు.

* * *

'పారూ? 'ఆనాకెరినినా' అని ఓ మంచి యింగ్లీషు సినిమా వచ్చింది. వెళ్దాం నువ్వు త్వరగా బట్టలు మార్చుకో. నే నింతలో అలా వెళ్ళి సుందర్రావుని మరొకసారి హెచ్చరించి వస్తాను.' అన్నాడు ఈశ్వర్రావు వీధిలోకి వెళ్ళబోతూ.

అంతకుపూర్వం అనేకసార్లు తనంతతానుగా అడిగినా సినిమాకు తీసుకువెళ్ళని ఈశ్వర్రావు తలవని తలంపు సినిమాకు వెళదాం అనే సరికి పార్వతికి అమిత ఆశ్చర్యంతోబాటు ఎంతో ఆనందం కలిగింది. కాని సుందర్రావు ప్రసక్తి వచ్చేసరికి ఆమె ఆనందం కాస్తా అణగారిపోయింది...సుందర్రావు ఈశ్వర్రావు పనిచేసే ఆఫీసులోనే పనిచేసే మరో గుమాస్తా. అతని కాపురం కూడ ఆ వీధిలోనే సుందర్రావు ప్రసక్తి వచ్చేప్పటికే పార్వతి

మనస్సు అదోలా అయిపోవడానికి కారణం, సుందర్రావు చెడ్డవాడని గాని, అతగాడితో సినిమాకి వెళ్ళడం తనకంత రుచించదనేది కాని. కానేకాదు. 'సుందర్రావు భార్యకూడ వస్తుందేమో' అందుకే తన భర్త ఎప్పుడూ లేనిది అంతహుషారుగా సినిమాకి బయలుదేరుతున్నాడేమో?' అది అసలు కారణం. తన భర్త సుందర్రావు భార్య సుగుణతో ఎంతో చనువుగా వుండే మాట యథార్థం. అతనలా ప్రవర్తించడంలో మరో విధమైన దురుద్దేశంగాని, దానివల్ల తనిని అలుసుగా చూడడంగాని, అతడెన్నడూ చేయలేదు. ఆ విషయం తనకి కూడా బాగానే తెలుసు. అయినా తనభర్త సుగుణతో అంత వుండడంవల్ల ఆమె కప్పుడప్పుడు అదోలా అనిపిస్తూనే వుంటుంది. ఆమెకా అనుమానం కలిగినప్పుడెల్లా 'పొరుగింటి పుల్లకూర...' ని గురించి జ్ఞాపకం చేస్తూనే వుంటుంది. ఇప్పుడు కూడా భర్త సుందర్రావు యింటికి వెళ్తున్నాననే సరికి ఆమాట ఆమె నాలిక చివరి కంటూ వచ్చింది. కాని పైకి అనలేకపోయింది.

ఈశ్వర్రావు అలవాటులో పొరబాటుగా భార్య ముఖకవళికలోని భావాన్ని పసికట్టాడు. 'ఏం ఆగిపోయావేం? కడుపులోవున్న దేదో బైటికి కక్కేస్తే ఎంతో ఆరోగ్యకరం' అన్నాడు చిలిపిగా పార్వతి కళ్ళల్లోకి చూస్తూ.

'.........'

'ఇంతకీ సుందర్రావు సపత్నీ సహితంగా వస్తాడేమో' ననేగా నీ అనుమానం? అబ్బబ్బ యీ అమ్మాయిలకి ఎంతెంత అనుమానాలు బాబూ! నిన్ను ఎగతాళి పెట్టి ఏడ్పించాలంటే నిజానికి యిదొక మంచి అవకాశమే. కాని నా కంత వ్యవధి లేనప్పుడు సినిమాకి వేళవుతోంది. అందుకని ఇంతసేపూ నీకు చెప్పకుండా దాచి వుంచిన అసలు విషయాన్ని చెప్తా విను' ఇంటికి వచ్చే ముందు హోటలుకు వెళ్ళాను, అదొక విశేషం. ఇప్పుడు సినిమాకి బైలుదేరుతున్నాం, ఇదొక విశేషం. దీనికంతా కారణం, మా ఆఫీసులోని ఉద్యోగులందరి ఐక్యతవల్ల ఈ నెలనుండి మా జీతాలను పెంచారు. అదేమంత పెద్ద మొత్తం కాదనుకో' అయితేనేం? మావంటి బడుగు గుమస్తాలకి అదే పెద్ద సంతోష కారణం. అందువల్లనే అలవాటు లేని యీ ఆకస్మిక సినిమా ప్రయాణం! ఇప్పటికైనా ఒప్పుకుంటావా? నీ అనుమానాలు యింతకు ముందు మాదిరిగానే యిప్పుడుకూడ నిరాధారాలని?' ఈశ్వర్రావు పార్వతి, బుగ్గమీద ఓ చిన్న చిటికె వేయబోయాడు, కాని పార్వతి అంతలోనే మెరపులా మాయమయింది. ఈశ్వర్రావు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ సుందర్రావు యింటి వైపు బయిలుదేరాడు.

